క్లుప్తంగా

డీఎంహెచ్ఓ ఏఓగా లక్ష్మీకుమారి



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిపాలనా అధికారిగా మేడూరి వెంకటలక్ష్మీకుమారి గురువారం విధుల్లో చేరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఏపీపీఎస్సీ ద్వారా 1987లో టైపిస్టుగా ప్రకాశం జిల్లా కంబంలో ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించి, 1995లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా 2017లో ప్రమోషన్ పొంది నల్లపాడు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)కు బదిలీ అయ్యారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా నరసరావుపేట డీఎంహెచ్ఓ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. మూడు రోజుల కిందట ఏఓగా ప్రమోషన్ పొంది గురువారం విధుల్లో చేరారు. నూతనంగా విధుల్లో చేరిన ఏఓ లక్ష్మీకుమారికి పలువురు కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీ శారదా పరమేశ్వరి రథోత్సవం



పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం 58వ వార్షికోత్సవాన్ని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: బీఆర్ స్టేడియంలో అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి శాప్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో నిర్దేశిత యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఆమె గురువారం స్టేడియంలో జరుగుతున్న పనుల్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి 15 నాటికి గ్రౌండ్ పనులు, 25 నాటికి గ్యాలరీ పనులు పూర్తి చేయాలని చెప్పారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాకర్స్ వస్తుంటారని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో శాప్ ఈఈ సిద్దయ్య, జీఎంసీ ఈఈ కోటేశ్వరరావు, డీఎస్డీఓ వెంకటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్, రాంబాబు, స్థానిక కార్పొరేటర్ మీరావలి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆర్డీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా నాగూర్ షరీఫ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్‌గా షేక్ నాగూర్ షరీఫ్ నియమితులయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు గురువారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కె.సుధీర్ గురువారం పదవీ విరమణ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన నాగూర్ షరీఫ్‌ను ఆర్డీ డాక్టర్ శోభారాణి, పలువురు కార్యాలయ ఉద్యోగులు అభినందించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న నాగూర్ షరీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొందడంతో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్, సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు మూర్తి, సెక్రటరీ చింతల కళ్యాణ్, పలువురు యూనియన్ నేతలు అభినందనలు తెలిపారు.

లాటరీ పేరుతో మోసం చేస్తున్న నలుగురిపై కేసు నమోదు

గుంటూరు రూరల్: లాటరీ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గుంటూరు రూరల్ మండలం రెడ్డిపాలేనికి చెందిన కుంటిగొర్ల దిబ్బరాజు, కుంటిగొర్ల అంజి, క్రోసూరు నరసింహారావు, బిట్రా సాంబశివరావు తక్కువ రేటుకు సామాన్లు కొనుగోలు చేసి, మిర్చి యార్డు సమీపంలో వాటిని లాటరీలు తీస్తున్నారు. యాభై రూపాయలకు టికెట్‌ను ప్రజలకు విక్రయిస్తున్నారు. వాటిలో సున్నా నంబరు కార్డులు ఎక్కువగా ఉంచి, టికెట్లు కొనుగోలు చేసిన వారికి సామానులు రాకుండా మభ్య పెట్టి మోసం చేస్తూ, అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3వేలతో పాటు స్టీలు సామానులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లపాడు సీఐ రాంబాబు తెలిపారు.

నగరంలో నిరంతర విద్యుత్ వెలుగులకు చర్యలు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



శంకుస్థాపనలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు

నెహ్రూనగర్: నగరంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. 20వ డివిజన్ సంపత్‌నగర్‌లో గురువారం 33/11 కేవీ కంటైనర్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పిరెడి మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి గానీ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టిందని చెప్పారు. ప్రస్తుతం కంటైనర్ సబ్ స్టేషన్‌ను రూ.6.50 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. దీనివల్ల చుటుపక్కల ఆరు డివిజన్ల పరిధిలో లోవోల్టేజ్ సమస్యలు ఉండవని పేర్కొన్నారు. గతంలో వేసవి వచ్చిందంటే ఆయా ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య అధికంగా ఉండేదని, గృహోపకరణాలు పాడైపోతున్నాయని తెలిపారు. రానున్న మూడు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ నగరంలో తమ పాలకవర్గం ఏర్పడ్డాక ఎన్నడూ లేని విధంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో రూ.400కోట్లకు పైగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం సంపత్ నగర్‌లో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ గుంటూరు జిల్లాలోనే అత్యాధునికమైందని, ఫీడర్లు, వైర్లు ట్రాన్స్‌ఫార్మర్లు అన్నీ కంటైనర్‌లోనే ఉంటాయని వివరించారు. ప్రజల అవసరమైన మౌలిక సదుపాయాల్ని కల్పించడానికి తమ ప్రభుత్వం ముందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కంద్రకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, సాదు రాజేష్, ఏపీసీపీడీసీఎల్ యస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్, ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 66 మంది విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులతో రోహిణీదేవి, ప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అద్వైత్ స్కిల్ హబ్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 66 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన 300 మంది విద్యార్థినుల్లో గ్రూప్ డిస్కషన్‌లో అర్హత సాధించిన 108 మంది జామ్ రౌండ్‌కు ఎంపికై ఉద్యోగాలకు అర్హత పొందారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో మక్కెన అజయ్‌కుమార్, రీసోర్స్ పర్సన్ పాటిబండ్ల జీవన్‌కుమార్ విద్యార్థినులకు జాబ్ రెడీనెస్‌పై అవగాహన కల్పించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి, డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్ అధ్యాపకులు అభినందించారు.

సిరి ధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన అమృతాహారం



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

లక్ష్మీపురం: కొర్రలు, సామలు, అరికెలు లాంటి సిరి ధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన అమృతాహారమని ఖాదర్ వలి అన్నారు. అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిధాన్యాలు ఔషధగుణాలు కలిగి ఉంటాయని తెలిపారు. కొన్ని వందల సంవత్సరాల నుంచి మన సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లపై జరిగిన, జరుగుతున్న దాడి ఫలితమే మన ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోవడానికి కారణమని వివరించారు. మన ఆరోగ్యాలు బాగుపడాలంటే ఆహారాన్ని మార్చుకోవాలని సూచించారు. మన పూర్వపు అలవాట్లను, సిరిధాన్యాల వాడకాన్ని పునరుద్ధరించుకునే వరకు షుగర్, బీపీ, క్యాన్సర్, హార్ట్ ఎటాక్‌లను పారదోలలేమని తెలిపారు. ఆరోగ్యానికి చిరునామా సిరిధాన్యాలని, రోజూ అవి ఉపయోగిస్తూ డాక్టర్లకు, రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఖాదర్‌వలిని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, వి.వి.రాం, పి.సాయిరాం పాల్గొన్నారు.

క్రీడలతో దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం



మైదానంలో అరుణ్‌కుమార్, రామకృష్ణప్రభు, అన్నా మధు, మాజేటి ప్రసాద్, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని వ్యాపారవేత్త త్రిపురమల్లు అరుణ్‌కుమార్ అన్నారు. సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్రీడల నిర్వహణ కోసం కృత్రిమంగా ఏర్పాటు చేసిన గడ్డి మైదానాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలతో పాటు విద్యాసంస్థల్లో క్రీడాకారులకు కేటాయించిన సీట్లు అర్హత కలిగిన వారు లేకపోవడంతో భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయని చెప్పారు. విద్యార్థులంతా చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అన్నా మధు మాట్లాడుతూ క్రీడా ప్రావీణ్యంతో విద్యార్థులు చదువులోనూ చురుకుగా ఉంటారని తెలిపారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి సన్నగిల్లి, సెల్‌ఫోన్, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారన్నారు. దీనిద్వారా ఊబకాయంతో, చురుకుదనం లేకుండా ఉంటున్నారని తెలిపారు. బాపూజీ కమిటీ కోశాధికారి మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ నూతన స్పోర్ట్స్ కిట్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి జయప్రకాష్, కార్యవర్గ సభ్యులు గుంటూరు సత్యనారాయణ, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ సుభద్ర, ఇంగ్లిషు మీడియం, హైస్కూల్ ప్రిన్సిపాల్స్ అరుణకుమారి, రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ. శ్రీధర్, కల్చరల్ సమన్వయకర్త మధుసూధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పలువురికి సన్మానం



జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సన్మానం



కరీమున్నీసాను సత్కరిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, విజయలక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేసిన ఉపాధ్యాయుల్ని సమాజం మరువదని ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. కరీమున్నీసాకు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 41 ఏళ్ల సుదీర్ఘ కాలం పని చేసిన కరీమున్నీసా ఎందరో విద్యార్థుల్ని తీర్చిదిద్దారని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టీ, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి. విజయలక్ష్మి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్వీఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు జుబేదాబేగం, రాబియాబస్రీ, వసుంధర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ...

నగరంపాలెం: జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) ఎస్ఐ సయ్యద్ సుభాని, ఏఎస్ఐ పోలయ్య (వట్టిచెరుకూరు పీఎస్) గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలు మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఇద్దరిని శాలువా, పూలమాలలతో సిబ్బంది ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో పోలీస్ శాఖకు, ప్రజలకు అవిరళ సేవలు అందించారని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు, ఏఎస్ఐ మైల సాంబశివరావు, బి.జానయ్య, బి లక్ష్మణ్, ఎండీ.హుస్సేన్, కరీముల్లా పాల్గొన్నారు.

మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాకీ అడిగిన మహిళను దుర్భాషలాడిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్లకు చెందిన కళ్లం హరితారెడ్డి రూ. 2లక్షలను అప్పుగా రాజీ ప్రహర్షికి ఇచ్చింది. బాకీ చెల్లించకపోవడంతో గురువారం ప్రహర్షి ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని కోరింది. హరితారెడ్డిని ప్రహర్షి దుర్భాలాడి బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కిష్కింధకాండ హరికథా గానం



హరికథాగానం చేస్తున్న జయంతి సావిత్రి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ అన్నమయ్య కళా వేదికపై శ్రీ మదజ్జాడాదిభట్ల నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో నారాయణదాసు 159వ జయంతి, 79వ వర్ధంతి పురస్కరించుకొని గురువారం నిర్వహించిన హరికథా గానం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి జయంతి సావిత్రి కిష్కింధకాండలో ఆంజనేయ స్వామి శ్రీరాముడిని సందర్శించిన విధానం, సుగ్రీవుని పట్టాభిషేకం పలు అంశాలను శావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై యం. నగధరరావు వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమాన్ని కర్రా సూర్యనారాయణదాసు, ఉపాధ్యాయుల రాజరాజేశ్వరి, కర్రా కామేశ్వరీదేవి, గంటా సావిత్రీదేవి పర్యవేక్షించారు.

ఏఎన్‌యూలో ఘనంగా 'యువ సంవాద్ ఇండియా'



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం యువ సంవాద్ ఇండియా -2047 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి. రవిశంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారత్ విశ్వ గురువుగా మారడానికి ఆర్థిక, సామాజిక, వాతావరణ పరిరక్షణ, సుపరిపాలన, నూతన ఆవిష్కరణలు ఎంతో కీలకమని తెలిపారు. బానిసత్వం నిర్మూలన చేయాలని, భారత దేశ వారసత్వ సంపదను కాపాడుకోవాలని సూచించారు. యువత బాధ్యతలు, విధుల్ని సక్రమంగా నిర్వహించడం ద్వారా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'గోల్ ఫర్ డెవలప్మెంట్ ఇండియా' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సీహెచ్. రవికుమార్ అధ్యక్షత వహించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రోగ్రాం అధికారులు పి. యుగంధర్‌రెడ్డి, డి.శ్రీనివాసరావు, సీహెచ్. డి. ఉమాశంకర్, సీహెచ్. పుణ్యశేఖర్, ఆచార్య కె.వి నిరుపమతో పాటు 150 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ ప్రమీలారాణి మాట్లాడుతూ మార్చి 13 ,14 తేదీల్లో 'కరెంట్ డ్రగ్ డెలివరీ టెక్నాలజీస్ ఇన్నోవేషన్స్ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఔషధ తయారీ కంపెనీల నుంచి సైంటిస్టులు, జాతీయస్థాయి విద్యాసంస్థలైన నైపర్‌తో పాటు పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సుకు కోశాధికారిగా కె. విజయకిశోర్, కోకన్వీనర్‌గా డి.రవిశంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యు.అన్నపూర్ణ, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.సుజన, ఎం.గాయత్రి రమ్య వ్యవహరిస్తారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో అధికారులు, ఫార్మసీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మూడు సంస్థలతో అవగాహన ఒప్పందం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)తో గురువారం మూడు సంస్థలు అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. పరిపాలనా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సమక్షంలో యూనివర్సిటీ అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు పరస్పరం మార్చుకున్నారు. తులసి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగేష్ చంద్ర, చైతన్య ప్యాకేజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తులసి రామచంద్ర ప్రభు, మద్ది లక్ష్మయ్య గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తరఫున ఆ సంస్థ అధినేత మద్ది వెంకటేశ్వరరావు సంతకాలు చేయగా, ఏఎన్‌యూ తరఫున మూడు ఎంఓయూలపై రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆయా సంస్థలు అందిస్తున్న సహకారం గొప్పదని తెలిపారు. ఎంఓయూలో భాగంగా ఈ మూడు సంస్థలు యూనివర్సిటీలోని ఐబీఎస్ (ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్)తో కలిసి పని చేస్తాయని చెప్పారు. విద్యార్థులకు విద్య, ఉపాధి కల్పన అంశాల్లో ఈ సంస్థలు సహకారం అందిస్తాయని వివరించారు. ఐబీఎస్ విభాగాధిపతి ఆచార్య వి. చంద్రశేఖరరావు మాట్లాడుతూ గడిచిన కొద్ది రోజుల్లో ఆరు సంస్థలతో ఐబీఎస్ విభాగం ఎంఓయూలు చేసుకుందని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు, ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగం డీన్ డాక్టర్ బి. నాగరాజు, ఐబీఎస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ప్రసన్నకుమార్, అధ్యాపకులు డాక్టర్ పి. విజయవాణి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ వి. చక్రవర్తి పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న కార్పొరేటర్ అంబేద్కర్

నెహ్రూనగర్: సొంతిల్లు లేని వారికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలతో పాటు వాటికి రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇస్తున్నారని 55వ కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్ చెప్పారు. 156వ సచివాలయంలో గురువారం జగనన్న కాలనీలో స్థలాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా పేదలు ఇల్లు లేక ఇబ్బందులు పడే పరిస్థితి లేదని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆదాం, రాంబాబు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భావితరాలకు ఆదర్శంగా నిలవాలి



ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులతో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి



సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న బీహెచ్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసల్యాదేవి, అధ్యాపకులు



లక్ష్మీనరసింహాపురంలో పాఠశాల విద్యార్థులతో హిందూ కళాశాల బృందం

కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవలో ఉన్న విద్యార్థినులు భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి సూచించారు. జోసఫ్‌నగర్, కృష్ణబాబు కాలనీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-2 ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేట్ కరుణకుమారి మాట్లాడుతూ వారం రోజుల పాటు తమ డివిజన్‌లో నిర్వహించిన శిబిరంలో భాగంగా విద్యార్థినులు అందించిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవడంలో ఎన్ఎస్ఎస్ శిక్షణ దోహదం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారిణి డి. ధాత్రికుమారి, 77వ వార్డు సచివాలయ అడ్మిన్ శ్రీవిద్య, అధ్యాపకులు వి. భవాని, పి. విజయలక్ష్మి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో ముగిసిన శిబిరం

బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-1 ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కౌసల్యాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఎం. గిరిజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హిందూ కళాశాల ఆధ్వర్యంలో...

హిందూ కళాశాల ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ లక్ష్మీనరసింహాపురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దళితకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి. వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త జె.వి. సుధీర్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ విశ్వ పాల్గొన్నారు.

విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులకు సర్టిఫికెట్లు, ట్రోఫీ అందజేస్తున్న లలిత ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉమ్మడి పరీక్ష మండలి (డీసీఈబీ) కార్యదర్శి జి. లలితప్రసాద్ సూచించారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పేరుతో జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లలిత ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి కల్పన అవకాశాలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు 21వ శతాబ్దపు నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్సీఈఆర్టీ, సమగ్రశిక్షతో పాటు ఉద్యమ్, రీడ్ బెనిఫిట్, అఫ్లోటన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎక్స్‌పోలో విద్యార్థులు ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా తొలి రెండు స్థానాల్లో ఎంపికైన మంగళగిరిలోని సీకే గరల్స్ హైస్కూల్, పెనుమాకలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఈఎండీపీ ప్రోగ్రాం మేనేజర్ సతీష్, సమన్వయకర్త డాక్టర్ పి. పద్మావతి, జిల్లా సైన్సు అధికారి రవికుమార్, జిల్లా సైన్సు సమన్వయకర్త గౌసుల్‌మీరా, ప్రోగ్రాం జోనల్ మేనేజర్ బ్రహ్మం, జిల్లా మేనేజర్ ఆరాధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహిరంగ ప్రకటన / హెచ్చరిక

మా క్లయింట్ చెన్నారెడ్డి రామిరెడ్డి, S/o. పెద్దిరెడ్డి, ఫోన్: 99899 62294 అడ్రసు: నెహ్రూనగర్, గుంటూరు నివాసస్తులు సూచనల మేరకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తి దాఖలా భూమిని చల్లా లక్ష్మమ్మ, W/o.వెంకయ్య, అరండల్‌పేట, గుంటూరు వారి నుండి కొనుగోలు చేయుటకు నిశ్చయించి వారి నుండి సక్రమమైన విక్రయ దస్తావేజు తనపేరిటకి గాని, అతను కోరినపేరిటకు గాని పొంది, బ్యాంకు నందు తనఖాపుంచి ఋణము కూడా పొందుటకు నిశ్చయించి ఉన్నందున ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్ననూ తక్షణమే మా క్లయింటుకు గానీ, మాకు గానీ వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. లేనిచో నిష్పేచి ఆస్తిగా భావించి మా క్లయింట్స్ సర్వసంపూర్ణ హక్కులతో విక్రయ దస్తావేజులు పొంది సదరు ఆస్తిని బ్యాంకులో తనఖా పుంచి ఋణం కూడా పొందెదరని, భవిష్యత్తులో సదరు ఆస్తి పై ఎటువంటి అభ్యంతరములు చెల్లనేరవని, భవిష్యత్తులో వారు కొనుగోలు చేసిన ఆస్తిని ఎటువంటి అభ్యంతరములు బద్ధపరచజాలవని మా క్లయింట్స్‌కు మాత్రమే ఇకపై సర్వసంపూర్ణహక్కులు కలిగి ఉండెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

గుంటూరు డి॥, పెదకాకాని సబ్ డి, గుంటూరు కొత్త మునిసిపాలిటీ లిమిట్స్, అగతవరప్పాడు గ్రామము, డి.నెం. 140/ఎ1, ఎ2 య॥ 8.46 సెంట్లు, య॥ 4.43 సెంట్లు, డి.నెం. 140/బి-బి య॥ 1.16 సెంట్లు, డి.నెం. 141/బి య॥ 6.65 సెంట్లలో య॥ 0.41 సెంట్లును ఈ మూడు నెంబర్ల బాపతు ఏకఖండముగా ఉన్నటువంటి భూమిని మింజుమలై య॥ 3.50 సెంట్లు భూమిలో వేయబడిన ప్లాట్లలో ప్లాన్ దాఖలా ప్లాట్ నెం.56 లోని 393.33 చ॥గ॥, ప్లాటు 67, 68లో గల 756.6 చ॥గ॥లలో ఖాళీ నివేశన స్థలము మాత్రమే.

కానాదిభొట్ల శ్రీనివాసమూర్తి, కెవిఆర్‌యస్ లక్ష్మి, న్యాయవాదులు
గుంటూరు. ఫోన్: 94406 44769, 98482 48769

తేది: 28-02-2024 ప్రదేశము: గుంటూరు

